క్లుప్తంగా

ఆహారంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి

యలమంచిలి: చిన్న పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి సూచించారు. ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య దశ నుంచే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు నేర్పించాలన్నారు. పిల్లలను జంక్ ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉంచాలని, జంక్ ఫుడ్ వల్ల ఊబకాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమ, అంగన్‌వాడీ టీచర్ బెజవాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో చాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధనలో చాంబర్స్ కళాశాల మొదట ఉందన్నారు. 64 మంది విద్యార్థులు 9.0 నుంచి 9.7 మధ్యలో గ్రేడ్ పాయింట్లు సాధించారని తెలిపారు. ఉత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, కార్యదర్శి కేవీ సీతారామరాజు, అకాడమిక్ అడ్వైజర్స్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

గజల్ శ్రీనివాస్‌ను పరామర్శించిన గోపి



రత్నావళి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గోపి

పాలకొల్లు సెంట్రల్: తన మాతృమూర్తి కేసిరాజు రత్నావళిని కోల్పోయిన ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పరామర్శించారు. రత్నావళి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపి వెంట పార్టీ పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు నాయకులు ఉండ్రాజవరపు రవి, గేదల నరసింహారావు, చాన్ బాషా, దేవ రాజేష్ ఉన్నారు.

సేవకు ప్రతిరూపం ఎన్‌ఎస్‌ఎస్



ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సేవకు మదర్ థెరిస్సా స్ఫూర్తి అని, ఆమెను ఆదర్శంగా తీసుకుని ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాలు చేయాలని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. గురువారం నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌డే ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కోశాధికారి కె.వెంకటేశ్వర స్వామి, కళాశాల డైరెక్టర్ అద్దాల శ్రీహరి, టీవీవీ ప్రసాద్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువుర్ని సన్మానించారు. డైరెక్టర్ ఎస్ కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.గోపీచంద్, స్వామినాథం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ విశ్వమాణి క్యాలరావు, ఎంవీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నేడు పీ4పై శిక్షణ

పాలకోడేరు: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ఆదేశానుసారం మండల స్థాయిలో పీ–4 అమలుపై మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది అందరికీ పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు . ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.

మహిళలకు బాబు మార్క్ మోసం

- ఆడబిడ్డ నిధి ఊసెత్తని సర్కారు పెద్దలు
- సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల్లో హడావుడి



డ్వాక్రా మహిళలు (ఫైల్)

యలమంచిలి: సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అన్నారు. అనంతపురంలో ఉత్సాహంగా విజయోత్సవం నిర్వహించారు. నేతలంతా ప్రసంగాలతో ఊదరగొట్టారు. సూపర్ సిక్స్‌లో అమలు చేయని మరో పథకం ఆడబిడ్డ నిధి.. ఆ పథకం ఎక్కడంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు తనను నమ్మడం లేదని తెలుసుకుని.. తాను మారిన మనిషినని.. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని.. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. అలా కూటమి నేతలు ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ఇప్పుడు మహిళలందరిలోనూ అయోమయం నెలకొంది. తాము అధికారంలోకి వస్తే 18 నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ వర్తింపజేస్తామని కూటమి నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. గెలిచిన తరువాత వారి బుద్ధి మరోసారి చూపించి మహిళలకు మళ్లీ శఠగోపం పెట్టారు. 2014 ఎన్నికలకు ముందు కూడా డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేయగా.. ఈసారి ఆడబిడ్డ నిధి పథకం పేరుతో మోసం చేశారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పథకం ఊసే లేదు. నమ్మి ఓట్లేసిన వారికి మరోసారి టోపీ పెట్టేందుకు చూస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని ఓ మంత్రి మాట్లాడడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చేందుకు నోటికొచ్చిన హామీలు ఇచ్చినప్పుడు ఆ సంగతి తెలియదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు పెద్ద పీట..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందేవి. అన్ని వర్గాల ప్రజలు ఏదో విధంగా లబ్ధి పొందేవారు. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక చేయూత నందించేందుకు అప్పటి ప్రభుత్వం వారి ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమ చేసింది. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల సొమ్మును మహిళల ఖాతాల్లో జమ చేసింది. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా.. ఆడబిడ్డ నిధి అమలుకు నోచుకోలేదు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియక అయోమయంలో ఉన్నారు.

నియోజకవర్గ పరిధిలో..

పాలకొల్లు నియోజకవర్గంలో సుమారు 93 వేల మంది ఈ పథకానికి అర్హులున్నారు. ప్రతి నెల రూ.1500 ప్రకారం రూ.13.95 కోట్లు ఇవ్వాలి. ఈ పరిస్థితుల్లో ఆడబిడ్డ నిధి అమలు చూయాలంటే ఆంధ్రాను అమ్మాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏరుదాటక తెప్ప తగలేసే రకం అంటే ఇదేనని చర్చించుకుంటున్నారు. దసరాకు పథకంపై ప్రకటన చేస్తారని అక్కచెల్లెమ్మలు ఆశగా ఎదురు చూశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విశ్వసనీయత నిరూపించుకోవాలి



మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఏడాదిన్నర దాటినా ఇంతవరకు పథకాన్ని అమలు చేయలేదు. జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 చొప్పున ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి మహిళలను ఆదుకోవాలి. ఇచ్చిన హామీలు చేతల్లో చూపినప్పుడే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది.

– వినుకొండ ధనలక్ష్మి, ఎంపీపీ యలమంచిలి

ప్రచార ఆర్భాటమే..



అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధ పథకం అమలు చేస్తామని ఊరూరా ప్రచారం చేశారు. బాండులు ఇచ్చి మాది హామీ అన్నారు. ఏడాదిన్నర కావస్తున్నా ఈ పథకం అమలుకు అతీగతీ లేదు. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక మరోలా వ్యవహరిస్తున్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ అని గతంలో ఓట్లేయించుకుని మోసం చేశారు. ఇప్పుడు ఆడబిడ్డ పేరుతో మరోసారి మోసం చేస్తున్నారు.

– శిరిగినీడి లక్ష్మీ సునీత, ఎంపీటీసీ సభ్యురాలు, అబ్బిరాజుపాలెం

వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నరసాపురం పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద అమ్మవారు కూష్మాండ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణస్వామినాయుడు, గునిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షించారు. రాయిపేట పుంతలో ముసలమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. గడ్డిబజార్ కనకదుర్గమాతకు ప్రత్యేక అలంకరణ చేశారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవార్లు

పెనుగొండ: నాలుగో రోజు గురువారం పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, వాసవీ కన్యకపరమేశ్వరిలు లలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. అఖిల భారత వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాత రాజదర్బార్ రాజుకుమారిగా దర్శనమిచ్చారు. నవరాత్రి బొమ్మల కొలువు ఆకట్టుకొంది. ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ కాత్యాయినిగా పూజలందుకొన్నారు.

విశాలాక్షిగా దుర్గమ్మ దర్శనం

యలమంచిలి: పట్టణంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్ని విశాలాక్షి దేవి రూపంలో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అమ్మవారు జోగులాంబ దేవిగా పూజలు అందుకున్నారు. యలమంచిలి మండలం అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయం వద్ద కొలువైన అమ్మవారికి అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు.



పెనుగొండ: మరకత శిల వాసవీ మాత



పెనుగొండ: మహిషాసురమర్దని



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గమ్మ



పెనుగొండ: పెదమల్లం మాచేనమ్మ



ఆర్య వైశ్య కల్యాణ మండపంలోని కనకదుర్గమ్మ



పెనుగొండ : బొమ్మల కొలువు



అడవిపాలెంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఈక్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ బాలా త్రిపుర సుందరి

యలమంచిలి: వరి సాగు చేసే రైతులందరూ ఈక్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దుంగా బాలా త్రిపుర సుందరి సూచించారు. మేడపాడు రైతు సేవా కేంద్రంలో గురువారం ఆమె ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఈక్రాప్‌లో పంట నమోదు చేయించుకున్న రైతుల ధాన్యం మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకి రూ.2,389, సాధారణ రకానికి క్వింటాల్‌కి రూ.2,369 కనీస మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతులు ధాన్యంలో తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతంలోపు, పరిపక్వము కాని ముడుచుకుపోయిన వంకర తిరిగిన ధాన్యం గింజలు 3 శాతంలోపు ఉంటే ధాన్యం కొంటామని తెలిపారు. మేడపాడు సొసైటీ చైర్మన్ అద్దాల రాజశేకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలు తప్పకుండ పాటించాలని కోరారు. ధాన్యం రవాణ వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చాలన్నారు. గోనె సంచులకు కొరత రానివ్వమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, రైతులు, వ్యసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలో సమాజానికి ఉపయోగపడాలి

భీమవరం: విద్యార్థులు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, టెక్నాలజీ వినియోగంతో సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలు తీసుకురావాలని విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించే వేదికగా స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విజయవాడ ఇన్క్యుబేషన్ హెడ్ దొనేపూడి రవితేజ అన్నారు. భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పార్క్ ట్యాంక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో పరిశోధన, స్టార్టప్ భావజాలం, జాతీయ స్థాయిలో పోటీ చేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ వీఎస్ఎన్ నర్సింహరాజు మాట్లాడుతూ స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను వెలికితీస్తాయని, నేటి యువత సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను కనుగొని స్టార్టప్‌ల రూపంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల స్వర్ణోత్సవ ర్యాలీ



పెనుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్వీకేపీ విద్యార్థులు

పెనుగొండ: 50 ఏళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల విద్యార్థులు గురువారం పురవీధుల్లో స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ఉదయం ర్యాలీని పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజులు ప్రారంభించారు. 1600లకుపైగా విద్యార్థులు కళాశాల నుంచి మెయిన్‌రోడ్డు, జవ్వాదివారి వీధి, ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ కొనసాగింది. ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు సందర్భంగా పూర్వ విద్యార్థులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు విభాగాధిపతి రంకిరెడ్డి రామ్మోహనరావు, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజరు సత్తి సుబ్బన్న రెడ్డి, సుబ్రహ్మణ్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న రాజ్ ట్రస్ట్ సభ్యులు.

నరసాపురం రూరల్: పేద మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాజ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామని ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్ కుమార్ అన్నారు. గురువారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో 22 మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఒరిస్సా ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటివరకు 2200 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మెషీన్లు అందించామన్నారు. ఎంపీపీ మైలాబత్తుల బత్తుల సోనీ, దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కార్యదర్శి ఇంజేటి జాన్ కెనడీలు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకిలేటి ఆనందకుమార్ (మధు), వర్ధన సుధాకర్, పిట్టా రామారావు, వర్ధనపు సుదాకర్, పిల్లి చిట్టి రాజు, బండారు పెద్దిరాజు, తిరుమాని నరసింహారాజు, మైలాబత్తుల శ్రీను, కాటన్ చంటి, మురాల స్వామి, పెదపాటి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

పెనుగొండ: విద్యార్థులు కంటి చూపుపై శ్రద్ధ వహించాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ అన్నారు. కళాశాలలో గురువారం పాలకొల్లు రాధారమణ లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు ప్రారంభించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



లక్ష్మణేశ్వరంలో ఆయుర్వేద, హోమియో క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్లు

నరసాపురం రూరల్: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని లక్ష్మణేశ్వరం హోమియోపతి డాక్టర్ శాస్త్రి ఆకెళ్ల అన్నారు. గురువారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం ప్రభుత్వ హోమియో వైద్యశాలలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. 43 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పాలకొల్లు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు గిరీష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్టేరు దేవస్థానం ఈఓపై ఫిర్యాదు



తమనంపూడి వెంకట సత్యనారాయణరెడ్డి

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన ఈఓపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామని దేవస్థానం చైర్మన్ తమనంపూడి వెంకట సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈఓ తమ పాలక మండలి ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సమావేశం ఏర్పాటు చేయలేదని, తన ఇష్టానుసారం లావాదేవీలు నిర్వహించారని, ఆలయంలో అనేక అవకతవకలు జరిగాయని గతంలో దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆలయ భూమికి చెందిన కౌలుదారుడు కోనాల శ్రీరామారెడ్డి కొంతకాలం క్రితం మృతి చెందారని, ఆయన కౌలు బకాయి పడి ఉన్నారని పేర్కొన్నారు. కౌలు వేలం పాట నిర్వహించకుండా ఆయన భార్యకు కౌలుకార్డు రాయించి ఇచ్చి వారినే కౌలుదారునిగా కొనసాగిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, తమను పాలకమండలి నుంచి రాజీనామా చేయాల్సిందిగా ఈఓ ఒత్తిడి తెస్తున్నారని వివరించారు. దీనిపై విచారణ చేసి ఈఓపై చర్యలు తీసుకోవాలని దేవస్థానం చైర్మన్ వెంకట సత్యనారాయణరెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు మేడపాటి చిన్నారెడ్డి, సత్తి చంద్రారెడ్డి, సాకా సుగుణ, తదితరులు కోరారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో భూస్వాముల ప్రయోజనాల కోసం పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ అన్నారు. బొండాడ గ్రామంలో కూల్చిన పేదల ఇళ్లను, ఖాళీగా ఉన్న ఇరిగేషన్ భూములను గురువారం గోపాలన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలపై యుద్ధం పేరుతో ఇల్లు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతోందన్నారు. బొండాడ గ్రామంలో సుమారు 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించి 25 రోజులైనా ఇప్పటికీ వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు వెంటనే న్యాయం చేసి, మూడు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్వారాలు, కిటికీలు లేని పాఠశాల భవనం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి ద్వారాలు, కిటికీలు లేవు. పాఠశాల పునఃనిర్మాణ పనులు చేపట్టి రెండున్నరేళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కాలేదు. గతంలో పురాతన భవనం కూలడానికి సిద్ధంగా ఉండటంతో, ఆభవనాన్ని పూర్తిగా తొలగించి నాడు–నేడు నిధులతో పునః నిర్మాణం చేపట్టాఆరు. రెండు అంతస్తుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా ఒక అంతస్తు మాత్రమే నిర్మించారు. రెండు తరగతి గదులు నిర్మించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి కిటికీలు, తలుపులు, గుమ్మాలు లేకుండా మొండి గోడలతో ఉన్నాయి. కుక్కలు, ఇతర జంతువులు లోపలికి వెళ్లకుండా బల్లలు అడ్డుపెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిని తరువాత నాడు–నేడు నిధుల్ని ఆపివేసి, ఎక్కడ పనులు అక్కడే నిలుపుదల చేశారు. పాత నిధులు మంజూరు చేయాలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం మన బడి–మన భవిష్యత్ పథకం క్రింద నిధులు మంజూరు కావలసి ఉంది. అప్పటి వరకూ ఓరుగాలిలో విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించాల్సిందే.

ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత సాధ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం అని, ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్వచ్ఛతహి సేవ 2025లో భాగంగా ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం భీమవరం పట్టణంలో పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఎడ్వర్డ్ ట్యాంక్ చుట్టూ మున్సిపల్ కార్పొరేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మెప్మా, మహిళలు చేపట్టిన శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమని అన్నారు.